

చిన్న కోడిగుడ్ల సరఫరాపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో పెద్దలోచిలి పంచాయతీ పినలోచలి అంగన్వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజన పథకం, ఆశ్రమ పాఠశాలకు సరఫరా చేస్తున్న గుడ్ల నాణ్యతను పాడేరు శాసనసభ్యులు మత్స్య రాస విశ్వేశ్వరరాజు శనివారం పరిశీలించారు. గుడ్ల పరిమాణం చిన్నదిగా ఉండటంతో సరఫరాదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడంతో ఈ సంఘటనలు చేసుకుంటున్నట్టు పలు విమర్శలు కూడా ఉన్నాయన్నారు.



కోడి గుడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మీ పిల్లలకైతే.. ఇలాంటి భోజనమే పెడతారా...

- అధికారులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం



ఘటనపై ఆరా తీస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని జాంగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కలిషితమైన ఆహారం తిని ఫుడ్ పాయిజన్‌కు గురై కడుపునొప్పి, వాంతులతో సుమారు 91 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై అరకులోయ ఏరియా హాస్పిటల్‌లో చేరారు. అస్వస్థతకు గురై శుక్రవారం రాత్రి 61 మంది విద్యార్థులు హాస్పిటల్‌లో చేరగా శనివారం ఉదయం మరో 30 మంది చేరారు. ఈ విషయం తెలుసుకున్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ శనివారం ఉదయం జాంగుడ ఆశ్రమ బాలికల పాఠశాలలో సందర్శించారు. ఫుడ్ పాయిజన్ కు కారణాలపై విద్యార్థులను, పాఠశాల ఉపాధ్యాయులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శనివారం ఉదయం పిల్లలకు వండిపెట్టిన పులిహోర నాశిరకంగా వండి పెట్టడాన్ని గ్రహించిన కలెక్టర్ వీరు పిల్లలా లేక పశువులు అనుకుంటున్నారా.. మీ పిల్లలకైతే ఇదే విధమైన నాశిరకమైన భోజనాన్ని వండి పెడతారా అంటూ జిల్లా కలెక్టర్ సంబంధిత ప్రధానోపాధ్యాయురాలు, మెట్రిన్, డిడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో భోజన మెనూ ఫోటోలు ఎప్పటికప్పుడు అప్లోడు చేయిస్తూ పర్యవేక్షణ చేయాలని ఐటిడీఏ డిడి కొండలరావుకు, పిఒ అభిషేక్‌లను ఆదేశించారు. అనంతరం అరుకు ప్రాంతీయ హాస్పిటల్‌ను సందర్శించి అస్వస్థతకు గురై వైద్యం పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు.

కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.:

ఫుడ్ పాయిజన్‌కు కారణాలపై ఐటీడీఏ డిడి, ఏ టి డబ్ల్యూ, ఎంపీడీవో, తహసిల్దార్ తో కమిటీ ఏర్పాటు చేసి సమగ్రంగా విచారణ నిర్వహించి బాధ్యులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఐటిడిఎ పిఒ అభిషేక్ చెప్పారు. పాఠశాల మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్నం వండిపెట్టిన భోజనం పరిశీలించారు. వండిపెట్టిన వంకాయ బటాని కూరలో బటాని సరిగా ఉడక పోవడంతో పాటు, సాంబారులో పప్పు తక్కువ ఉండడాన్ని గ్రహించిన ఆయన ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేశారు.

శ్రావణ్, దొన్నుదొర పరామర్శ:

మాజీ మంత్రి, టిడిపి అరకు పార్లమెంటు ఇంచార్జ్ కిడారి శ్రావణ్ కుమార్, అరకు అసెంబ్లీ ఇన్చార్జ్ ఎస్ దొన్ను దొర పాఠశాలలు సందర్శించారు. ఫుడ్ పాయిజన్‌కు కారణాలపై అధికారులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అరకు హాస్పిటల్‌లో విద్యార్థులను పరామర్శించారు.

విద్యార్థులు కోలుకుంటున్నారు : కలెక్టర్

అరకు లోయ :కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులు అందరూ కోలుకుంటున్నారని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ .దినేష్ కుమార్ స్పష్టం చేశారు. డుంబ్రిగూడ మండలం జామి గూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులను స్థానిక ఏరియా ఆసుపత్రిలో శనివారం ఉదయం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 61 మంది విద్యార్థులను అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించడం జరిగిందని చెప్పారు. ఒక విద్యార్థిని మలేరియాతో బాధపడుతున్నట్టు గుర్తించి ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ్, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, ఆసుపత్రి వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన సంఘం నేతల పరామర్శ

అరకులోయ రూరల్: డుంబ్రిగుడ మండలం జాముగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కలుషిత ఆహారం తినడంతో అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుతున్నారు. ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, నాయకులు, సూర్యనారాయణ, జగనాదం, మగ్గన్న ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శించి ఆరోగ్య పరిస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు.

తూతుమంత్రంగా పర్యవేక్షణ: యుటీఎఫ్

అరకులోయ రూరల్: డుంబ్రిగూడ మండలం జాముగూడా గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో 655 మంది విద్యార్థులకు సరిపడ్డా వసతి సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు లేనప్పటికీ అంత మంది విద్యార్థులకు ప్రవేశం ఎలా కల్పించారని యూటీఎఫ్ నాయకులు ప్రశ్నించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఈ పాఠశాలలో భోజనం బాగోలేదని గతంలో కూడా పత్రికా కథనాలు వచ్చాయని తెలిపారు. అధికారులు తూతు మంత్రంగా పర్యవేక్షణ చేసి వదిలేసారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పి.దేముడు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ కన్నయ్య, శెట్టి బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం : పిఒ

అరకులోయ :జాముగుడ హాస్టల్లో అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ పేర్కొన్నారు. అవసరమైతే విశాఖపట్నం తరలించి మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శనివారం ఉదయం డుంబ్రిగూడ మండలం జాము గుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను, అరకులోయ ఏరియా ఆసుపత్రిని శనివారం సందర్శించి విద్యార్థిను లను పరామర్శించారు. ఆశ్రమ పాఠశాలో ఉన్న ఆర్వో ప్లాంట్ ను మరమ్మత్తులు చేయాలని ఉపసంచాలకులను ఆదేశించారు.

గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన:

జాంగుడ విద్యార్థులు ఫుడ్ పాయిజన్ ఘటనకు కారణమైన ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం ఆ పాఠశాల వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పట్టి, సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించి, సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ



ఆందోళన చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ, పాఠశాలలో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.పాఠశాలలో ఆర్వో ప్లాంట్ మరమ్మత్తు చేసి సురక్షితమైన తాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని డిడి కొండలరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.సూర్యనారాయణ, పి సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.సురేంద్ర, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలు పాల్గొన్నారు.

పరామర్శించిన గిరిజన మహిళ సంఘం

దుంబ్రిగుడ: మండలంలోని జాంగుడ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ తో అస్వస్థతకు గురై అరకులోయ ప్రాంతీయ హాస్పిటల్ లో వైద్యం పొందుతున్న విద్యార్థినిలను శనివారం గిరిజన మహిళా సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ పి.కుమారి పరామర్శించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ, ఉడికి ఉడకని నాశరకమైన భోజనం పెట్టడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు.

మెనూలో మార్పు ఏదీ?

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని జాంగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌లో విద్యార్థులు ఆసుపత్రిలో అధికారుల్లో తీరు మారలేదు. స్థానిక ఆ పాఠశాలలో శనివారం కూడా భోజనం మెనూ అమలులో తీరు మారలేదు. శనివారం ఉదయం విద్యార్థులకు పెట్టిన అల్పాహారంలో పులిహార ఉండగా అది ఉప్మా మాదిరిగా నాసిరకంగా వండి పెట్టారు. మధ్యాహ్నం పెట్టిన వంకాయ బటాని కూరలు బఠాణి ఉడకలేదు.



నీళ్ల మాదిరిగా ఉన్న సాంబారు

సాంబార్‌లో విద్యార్థుల సంఖ్య సరిపడే పప్పు కలపకుండా చాలీచాలదిగా పెట్టారు. సాంబార్ కు బదులు రసంలాగా ఉంది. శనివారం ఆ పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీవో అభిషేక్, డిడి కొండలరావు బోజన మెనునూ పరిశీలించారు. నాసిరకంగా ఉండడంతో నిర్వాహకుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు భోజనం మెనూ పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ రెడ్డి ప్రసన్న

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- రాజమండ్రి 6వ మెజిస్ట్రేట్ రెడ్డి ప్రసన్న

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల సిబ్బంది శ్రద్ధ చూపాలని రాజమండ్రి 6వ మెజిస్ట్రేట్ జడ్జి రెడ్డి ప్రసన్న అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వులు మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో ఆమె శనివారం మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాల, స్థానిక గురుకుల పాఠశాల, ఆశ్రమ పాఠశాలలను ఆకస్మిక సందర్శించి తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో వసతులు, పరిసరాలు ఏ విధంగా ఉన్నవి, విద్యార్థులకు మెనూ ఎలా అందుతున్నది, వారికి అందే సౌకర్యాలు, వసతి గృహాల్లో సరుకులు తదితర వాటిపై ఆరా తీశారు. పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యకరమైన సంపూర్ణమైన ఆహారం అందించాలన్నారు. వారికి అన్ని సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలని, వారి ఆరోగ్య పరిస్థితి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యార్థులు కష్టంతో కాకుండా, ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ ఎస్ వెంకయ్య, పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



డొంకరాయి జలాశయం నుండి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

డొంకరాయి జలాశయం నుండి 4400 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి-సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి జలాశయం నుంచి 6 7 గేట్లు ద్వారా 4400 క్యూసెక్కులు నీటిని దిగు ప్రాంతానికి విడుదల చేస్తున్నామని ఇఇ విజయ్ కుమార్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ గత మూడు నాలుగు రోజుల నుంచి డొంకరాయి పరిసర ప్రాంతాలతో పాటు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఇన్ఫ్లో అధికంగా వచ్చి చేరుతుండడంతో జలాశయంలో నీటిమట్టం రోజురోజుకీ పెరుగుతుందని పేర్కొన్నారు. రిజర్వాయర్ల నీటిమట్టాలు సమాంతరంగా ఉంచడానికి నిరంతరం నీటి నిల్వలను పర్యవేక్షిస్తూ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పవర్ కెనాల్ నుంచి 4000, డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా దిగు ప్రాంతానికి 4400, మొత్తం 8400 క్యూసెక్కుల నీటిని శుక్ర, శనివారాల్లో విడుదల చేసినట్లు చెప్పారు. డొంకరాయి జలాశయం నీటిమట్టం 1037 అడుగులు కాగా ప్రస్తుతం 1036 అడుగుల నీటిమట్టం సమాంతరంగా ఉన్నట్లు తెలిపారు. వాగులు వంకలనుంచి ఇన్ఫ్లో వచ్చింది వచ్చినట్టుగా దిగు ప్రాంతానికి విడుదల చేస్తున్నామని ఆయన తెలిపారు.



పంపిణీ చేస్తున్న కలెక్టర్

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-హుకుంపేట: ప్రజా సేవలో అంకిత భావంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని తాడేపుట్టు పంచాయితీ ఉగ్రాడ నిమ్మలపాడు గ్రామంలో పింఛన్లను శనివారం పంపిణీ చేపట్టారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లపై వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలన్నారు.పింఛన్ల పంపిణీ పై ఎటువంటి జాప్యం జరగకుండా సజీవుగా జరగాలన్నారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై గ్రామస్తులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే గ్రామ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట ఎంపీడీవో వెంకటరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

అడ్డతీగల: అడ్డతీగల మండలం వేటమామిడి పంచాయతీలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పాల్గొన్నారు. భారీ వర్షంలోనూ గొడుగులు వేసుకుని ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ రంగారావు, టిడిపి కూటమి నాయకులు స్వప్న కుమారి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని కింద్ర పంచాయతీ అనంతగిరి గ్రామంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి శనివారం ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 1న ఆదివారం కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో లబ్ధిదారులకు ఒక్కరోజు ముందుగానే పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.



పైనంపాడు సచివాలయం వద్ద ఉన్న పింఛనుదారులు

పింఛన్ కోసం పడిగాపులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని పైనంపాడు, వేంగడ పంచాయతీలో పింఛను కోసం పింఛనుదారులు అవస్థలు పడ్డారు. పింఛను సొమ్ము కోసం పైనంపాడు పంచాయతీ సచివాలయ కేంద్రం వద్ద ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పడి కాపులు కాశారు. సచివాలయం ముందు సిబ్బంది రాక కోసం గంటల తరబడి వేచి చూశారు. మధ్యాహ్నం తర్వాత పంపిణీ చేసినట్లు పింఛన్ దారులు తెలిపారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

ప్రజాశక్తి-చింతూరు

రాష్ట్రంలో టిడిపి కూటమి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో సురేష్ మాట్లాడుతూ అధికారంలోకి రావడం కోసం తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడి రాష్ట్ర ప్రజలకు ప్రధానంగా రైతులకు, మహిళలకు, విద్యార్థులకు, పెన్షనర్లకు, ఉద్యోగస్తులకు, గ్రామ వాలంటీర్లకు అనేక హామీలు ఇచ్చాయని గుర్తు చేశారు. ప్రధానంగా సూపర్ సిక్స్ పేరుతో రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20వేలు, స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పేరుతో ప్రతి ఏటా రూ.15వేలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, లేదా రూ.3వేలు నిరుద్యోగ భృతి, మహిళలకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ బండలు, ప్రతి నెలకు రూ.1500, ఉచిత



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్

బస్సు ప్రయాణం వంటి ఏ వాగ్దానాన్ని అమలు చేయడం లేదని పేర్కొన్నారు. స్కీముల అధ్యయనం పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. గ్రామస్థాయిలో సేవలు అందించే వాలంటీర్లకు రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తామని చేసిన వాగ్దానాన్ని ఎక్కడా ప్రస్తావించడం లేదని, తక్షణమే వారిని విధుల్లోకి తీసుకొని, రూ.10వేలు వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, మండల నాయకులు మడకం చిన్నయ్య, పోడియం లక్ష్మణ్, మొట్టు రాజయ్య, కారం నాగేష్, కారం సుబ్బారావు గుర్రం పిడకయ్య, మడకం సురేష్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయం వరకు బస్సు నడపరూ..

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి వద్ద ఉన్న మండల తహశీల్దారు కార్యాలయం వరకూ ఆర్టీసీ బస్సు నడపాలని పలు గ్రామాల ప్రజలు, ప్రభుత్వ శాఖల ఉద్యోగులు కోరుతున్నారు. గోకవరం ఆర్టీసీ డిపోకు చెందిన ఒక బస్సు ప్రతి రోజూ గోకవరం నుండి భద్రాచలం వెళ్లి, ఆ తరువాత భద్రాచలం -రేఖపల్లి మధ్య రోజంతా తిరుగుతుంది. రాత్రికి కూనవరంలో నైట్ హాల్ట్ చేసి, మరుసటి రోజు ఉదయమే గోకవరం వెళ్లి, మళ్లీ యథావిధిగా భద్రాచలం-రేఖపల్లి మధ్య సర్వీసు చేస్తుంది. ఈ బస్సు గతంలో రేఖపల్లి తహశీల్దారు కార్యాలయం వరకు వచ్చి అక్కడ ఖాళీ ప్రదేశంలో ఆగి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తేది. దీంతో తహశీల్దారు కార్యాలయ ప్రాంతంలో ఉన్న అన్ని ప్రభుత్వ శాఖ ఉద్యోగులు, చింతూరు, కుందులూరు పరిధిలోని 40 గ్రామాల ప్రజలు అక్కడ బస్సు ఎక్కేవారు.

అయితే ప్రస్తుతం ఈ బస్సు రేఖపల్లి తహశీల్దారు కార్యాలయం వరకు రావడం లేదు. ఊరి చివర శ్రీరామగిరి వెళ్లే మార్గంలో బస్సును ఆపుతున్నారు. భద్రాచలం బయలుదేరినప్పుడు రేఖపల్లి జంక్షన్‌లో ఉన్న ప్రయాణికులను ఎక్కించుకొని వెంటనే వెళ్లిపోతుంది. అక్కడ ఒక్క నిమిషం కూడా ఆపడం లేదు. దీంతో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, చింతూరు, కుందులూరు పరిధిలోని 40 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక సందర్భాల్లో రేఖపల్లి జంక్షన్ వద్దకు వచ్చేసరికి బస్సు వెళ్ళిపోతుందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరో వైపు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు రేఖపల్లి తహశీల్దారు కార్యాలయం వద్ద నైట్ హాల్ట్ బస్సును నిలుపుదల చేసేవారు. ఇప్పుడు కూనవరంలోనే ఆగిపోతుంది. దీంతో భద్రాచలం నుండి వచ్చే ప్రయాణికులు కూనవరం వద్ద దిగి రాత్రి సమయంలో రేఖపల్లికి ఏడు కిలోమీటర్లు నడుచుకుంటూ రావాల్సి వస్తోందని రేఖపల్లికి చెందిన ప్రయాణికులు వాపోతున్నారు. గోకవరం ఆర్టీసీ డిపో అధికారులు స్పందించి బస్సును రేఖపల్లి తహశీల్దారు కార్యాలయం వరకు వచ్చే విధంగా, నైట్ హాల్ట్ రేఖపల్లిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రేఖపల్లి, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రేఖపల్లి ఊరి చివర శ్రీరామగిరి వెళ్లే మార్గంలో చెట్ల వద్ద బస్సును నిలుపుదల చేసిన దృశ్యం



ధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంట్రాక్టు కార్మికులు, సిఐటియు నేతలు

5న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-మోతుగూడెం

చింతూరు మండలం, మోతుగూడెం ఏపీ జెన్‌కో సంస్థ వద్ద సెప్టెంబర్ 5న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు నాయకులు తెలిపారు. ఈ మేరకు ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం లోయర్ సీలేరు పోల్లూరు జల విద్యుత్ కేంద్రం వద్ద కాంటాక్ట్ కార్మికులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రిజనల్ సెక్రెటరీ జె.రత్నం, నాయకులు బివి.రమణ, చింత రాంబాబు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

గిరిజనేతరుల అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అడ్డతీగల

ఏజెన్సీలో గిరిజనేతరుల అక్రమ కట్టాడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యాన శనివారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కుంజా శ్రీను మాట్లాడుతూ 1/70 చట్టం అమల్లో ఉన్నా అడ్డతీగల మండల కేంద్రంలో గిరిజనేతరులు అడ్డూఅదుపు లేకుండా ప్రభుత్వ, ఆదివాసీ భూములను ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్నా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వ్యవస్థ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ అక్రమ కట్టడాలపై స్థానిక పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేస్తే, వారు గిరిజనేతరులతో కుమ్మక్కై చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తీగల బాబురావు, మోదిగా నూకరాజు, పీట ప్రసాద్, కారు అరుణ కుమారి, ముర్ల పురుషోత్తం, నెమలిపూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఎఎస్‌పి నాయకులు

వర్షాలకు కంట్రోల్ రూముల ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు : రానున్న మూడు నాలుగు రోజుల జిల్లాలో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్లో 24 గంటలు పని చేసే విధంగా 08935299912, 08935293448 నంబర్లతో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేశారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ కార్యాలయాలు, సబ్ కలెక్టర్ కార్యాలయాలలో కూడా కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని తహశీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి వీలుగా 24 గంటలు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, అధికారులు సిబ్బంది అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి, సన్నద్ధతలో భాగంగా తమ సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు.తుఫాను నష్టాల నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశకి- జిమాడుగుల:స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ వెంకటరమణ శనివారం స్థానిక విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, వినాయకుని మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా తమ వద్ద అనుమతులు పొందాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.యువత గంజాయి, నాటు సారా వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:వినాయక చవితి పండగలో విగ్రహాల ఏర్పాట్లకు అనుమతులు తప్పనిసరిగా పొందాలని సీఐ ఎల్.హిమగిరి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సింగిల్ విండో సిస్టమ్ ద్వారా అనుమతులు పొందాలని, అధికార వెబ్ సైట్ అనుమతి పొందిన తర్వాతే విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.మండప నిర్వాహకులు సూచనలు తప్పకుండా పాటించాలని సూచించారు. కనీసం ముగ్గురు రాత్రి పూట మండపములో నిద్రించాలన్నారు.

సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో పెద్దలోచిలి పంచాయతీ పిన లోచలి గ్రామంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును సెయిల్లో విలీనం చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్లో విలీనం చేసి, నూటికి నూరు శాతం ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, మిగిలి ఉన్న నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, కాంట్రాక్టు కార్మికులకు జీతాల్లో కోత విధించరాదని ఎఐటియుసి జాతీయ సమితి ప్రధాన కార్యదర్శి అమర్జిత్కౌర్ ఉక్కు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఎఐటియుసి ఆధ్వర్యాన ఉక్కు ఎల్ అండ్ డిసి వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఆమె మాట్లాడుతూ, ఉద్యమాల ద్వారా ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం తన అనుకూలురైన పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెట్టే ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. దీనిని ఎఐటియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. కేంద్రం ఉక్కుకు కావలసిన ఐరన్ ఓర్, ఇతర ముడిసరుకులు సరఫరా చేసి ప్లాంట్ మనుగడకు కృషిచేయాలని కోరారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేకుంటే కలిసి వచ్చే కార్మిక సంఘాలతో ఐక్య ఉద్యమాన్ని ఎఐటియుసి తీవ్రతరం చేస్తుందని స్పష్టంచేశారు. ఈ ధర్నాలో ఎఐటియుసి నాయకులు ఆర్.రవీంద్రనాథ్, జి.ఓబులేసు, కెఎస్ఎన్.రావు, డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, మసేన్రావు, కె.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా న్యాయవాదులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

ప్రజాశక్తి- లీగల్: న్యాయవాద వృత్తిలో మహిళలు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే పట్టుదల, కృషి, సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ తిల్హారీ అన్నారు. విఎంఆర్డిఎ చిల్డ్రన్స్ ఎరినాలో ఉమెన్స్ అడ్వకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన సెమినార్ ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో అత్యున్నత న్యాయస్థానాల తీర్పులను అవలోకన చేసి, కేసుల విచారణలో ఉపయోగించుకుని కక్షిదారులకు న్యాయం చేస్తూ మహిళలు న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకోవాలన్నారు. వివా లోగోను ప్రారంభించారు.

పొంగుతున్న గెడ్డలు

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు


లక్ష్మీపురం మర్దగుడ గెడ్డ దాటుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి:తుఫాను ప్రభావ కారణంగా మండలంలో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గెడ్డలు దాటలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో శనివారం బీంపోలు పంచాయతీ పరిధి రామచంద్రపురం గెడ్డ పొంగి ప్రవహించింది. దాటలేక ఆ గ్రామానికి చెందిన ప్రజలు గెడ్డ మధ్యలో చిక్కుకుపోయారు. మరింత గెడ్డ పొంగి పోతుండడంతో గమనించిన గిరిజనులు వెనక్కు వెళ్లారు, దీంతో ప్రాణ గండం తప్పింది. గత ఏడాది ఇదే పంచాయతీ పరిధి లువ్వ బ్రిడ్జి దాటుతుండగా ముగ్గురు గల్లంతైన విషయం తెలిసిందే. లుంగపర్తి పంచాయతీ పరిధి నేలపాలెం, మూలగుమ్మి, కొనుకొండ, గుమ్మ పంచాయతీ పరిధి కడరేవు, గొప్పులపలెం, కొటెంగుడ, అనంతగిరి ఎగువసభ పంచాయితీల సరిహద్దు మర్దగూడ, లక్ష్మీపురం మధ్య ఉన్న గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. గ్రామాలకు చెందిన ప్రజలు గెడ్డలు దాటలేక తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. మండలంలోని మారుమూల అనేక గ్రామాల్లో , బ్రిడ్జిలు లేక పోవడంతోనే గిరిజన ప్రజలు గెడ్డల మీదుగా దాటుతూ ప్రతి సంవత్సరం ప్రాణాలు పోగొట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రోడ్లు, వంతెనలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు


రామచంద్రపురం గెడ్డ దాటుతున్న గిరిజనులు

నేటి నుంచి స్వచ్ఛత పక్షోత్సవాలు

డిఇఒ బ్రహ్మాజీరావు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో స్వచ్ఛత పక్షోత్సవాలు (స్వచ్ఛ పఖ్వాడా) నిర్వహించాలని డిఇఒ పి.బ్రహ్మాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజం పట్ల బాధ్యత, స్వచ్ఛతపై అవగాహన, పరిశుభ్రత పాటించడంతో అనారోగ్యం దరి చేరకుండా విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని ఉద్దేశంతో విద్యాశాఖ స్వచ్ఛత పక్షోత్సవాలు నిర్వహించ తలపెట్టిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సెప్టెంబర్ 1న ఉపాధ్యాయులు, విద్యార్థులతో స్వచ్ఛతా శపథం, 2,3 తేదీల్లో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన, 4,5న సమాజానికి చేరువ దినోత్సవం సందర్భంగా స్థానికులతో విద్యార్థులు మమేకం కావడం, 6న హరిత దినోత్సవ సందర్భంగా పాఠశాలల్లో మొక్కలు నాటడం, 7,8న స్వచ్ఛత భాగస్వామ్యంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీల నిర్వహణ, 9,10 చేతుల శుభ్రత ప్రాముఖ్యతని వివరించడం, తప్పని సరిగా చేతులు శుభ్రంగా ఉంచుకునేలా చూడటం, 11న వ్యక్తిగత పరిశుభ్రత దినోత్సవం, 12న సమాజంలో విద్యార్థిని భాగస్వామ్యం చేయడం, 13,14న స్వచ్ఛతపై భవిష్యత్తు ప్రణాళికను విద్యార్థులతో సిద్ధం చేయడం, 15 పక్షోత్సవాలు, వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించి ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

అనారోగ్యంతో అంగన్వాడీ కార్యకర్త మృతి

కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-చింతపల్లి:సర్వీస్లో ఉన్న అంగన్వాడి కార్యకర్త మృతి చెందితే ఐదు లక్షల ఎక్స్ గ్రేసియాతో పాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. కిటుముల పంచాయతీ పకాబు గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన అంగన్వాడీ కార్యకర్త రాడా దేవుడమ్మ మృతదేహాన్ని శనివారం ఆయన సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అంగన్వాడిలపై సవతి ప్రేమ చూపిస్తుందని మండి పడ్డారు. పరామర్శించిన వారిలో అంగన్వాడి సంఘం నాయకులు భవాని, నీలమ్మ, ఆశ సంఘం నాయకురాలు బాలమ్మ ఉన్నారు.

నేరాలు ఘోరాలు

భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలో అనుమానంతో భార్యను భర్త హత్యచేశాడు. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... పద్మనాభం గ్రామానికి చెందిన చిప్పలి వెంకటలక్ష్మి (26) విజయనగరం జిల్లా కొండకరకం గ్రామానికి చెందిన చిప్పలి భూలోక (30)కు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యపై అనుమానంతో శుక్రవారం రాత్రి 11, 12 గంటల మధ్యలో వారి మధ్య వివాదం తలెత్తింది. ఈ గొడవలో భార్యను పీక నులిమి చంపేసినట్లు పోలీసులు గుర్తించారు. భార్య చనిపోవడంతో భర్త భూలోక కత్తితో పొడిచుకొని అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నుంచి బయటకు వచ్చి కేకలు వేశాడు. స్థానికులు పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయాలతో ఉన్న భూలోకను విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కెజిహెచ్కు తరలించారు. వెంకటలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును పద్మనాభం సిఐ శ్రీధర్ దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల పరిస్థితి దయనీయం

తల్లి మృతి చెందడం, తండ్రి ఆసుపత్రిలో ఉండటంతో పిల్లల పరిస్థితి దయనీయంగా మారింది. అనుమానం పెనుభూతంగా మారడంతో ఇద్దరు చిన్న పిల్లలపై ప్రభావం పడింది. తండ్రి బతికినా కేసు విషయంలో జైలుకు వెళ్లే పరిస్థితి ఉంటుంది. దీంతో పిల్లలు అఖిల్ (4), అక్షిత (2) తల్లిదండ్రులకు దూరమై అనాథలుగా మారుతున్నారు. భూలోక భార్యతో ఎప్పుడూ గొడవపడి సొంత గ్రామానికి వెళ్లిపోయి అప్పుడప్పుడు వచ్చేవాడిని స్థానికులు చెబుతున్నారు.

బైక్ను ఢీకొన్న కారు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఎర్రవరం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జోగంపేట గ్రామానికి చెందిన బొచ్చా శ్రీరామమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీరామ్మూర్తి కూరగాయలు తీసుకొని నర్సీపట్నం మార్కెట్ కు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు స్పందించి గాయపడ్డ వ్యక్తిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నేటి నుంచి ఎఐటియుసి జాతీయ సమావేశాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలోని గురజాడ కళా క్షేత్రంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాలు జరగనున్నాయి. సమితి సమావేశాల ముగింపు సందర్భంగా మంగళవారం విశాఖ నగరంలో కార్మిక ప్రదర్శన, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే జాతీయ సమితి సమావేశాలకు దేశ వ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సమావేశాలలో ఎఐటియుసి జాతీయ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేంద్ర కుమార్, అమర్జిత్ కౌర్ తదితరులు పాల్గొననున్నారు. ఈ సమావేశాలలో దేశవ్యాప్తంగా కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కుల కోసం, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణపై పలు తీర్మానాలను ప్రవేశపెట్టి, చర్చ జరిగిన అనంతరం ఆమోదిస్తారని ఎఐటియుసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, కెఎస్ఎన్.రావు, జాతీయ సమితి సభ్యులు జె.రామకృష్ణ తెలిపారు.

ఉక్కునగరం ముస్తాబు

ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాలు సందర్భంగా ఉక్కునగరంలోని పలు కూడళ్లలో యూనియన్ జెండాలు, తోరణాలతో అలంకరించారు.

ఇపిఎస్ 95 పెన్షనర్ల డిమాండ్లు నెరవేర్చాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఇపిఎస్ 95 పెన్షనర్ల డిమాండ్లు నెరవేర్చాలని ఇపిఎస్ 95 పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేషనల్ గౌరవాధ్యక్షులు మంత్రి రాజశేఖర్ కోరారు. ఇపిఎస్ 95 పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఉక్కునగరం స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ సి భవన్లో నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ, పెన్షనర్ల న్యాయమైన కోర్కెలను తీర్చాలని డిమాండ్చేశారు.


మొక్క నాటుతున్న పిఒ అపూర్వ భారత్

అంగన్వాడీ కేంద్రంలో మొక్కల నాటివేత

ప్రజాశక్తి-చింతూరు : 'తల్లి పేరుమీద ఒక చెట్టు -మన రేపటి కోసం" అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని చట్టి అంగన్వాడీ కేంద్రం-2 ఆవరణలో శనివారం చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భారత్ మొక్కలు నాటారు. అంగన్వాడీ కేంద్రంలో పరిశుభ్రత, నిర్వహణను పరిశీలించారు. ప్రీస్కూల్ పిల్లలతో ముచ్చటించారు. అంగన్వాడి కేంద్రంలో ఎలక్ట్రికల్ సమస్యను గమనించి సమస్యను పరిష్కరించాలని వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆహారం నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. చింతూరు ఐటిడిఎ కార్యాలయం, అన్ని అంగన్వాడీ కేంద్రాల్లోనూ మొక్కలు నాటారు.

2న మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 2వ తేదీ సోమవారం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మారేడుమిల్లి మండలంలో మొక్కలు నాటుతున్నట్లు జనసేన మండల అధ్యక్షులు మళ్ళ దుర్గాప్రసాద్, యూత్ మండల అధ్యక్షులు బీశెట్టి సత్య శనివారం ప్రకటనలో తెలిపారు. ఆ రోజు జనసేన కార్యకర్తలు ప్రతి గ్రామంలోనూ పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని కోరారు.

4న మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 4న బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎ.వీరకిషోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

నిరుపేదలకు శ్రేయ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంపాదనలో ఎంతో కొంత నిరుపేదలకు ఇవ్వడంలో సంతృప్తి ఉంటుందని, దాన్ని ఎంత పెట్టినా కొనలేమని తలంచి సామాజిక బాధ్యతను తమ కర్తవ్యంగా భావించిన శ్రేయ గ్రూప్ ఆఫ్ కంపెనీలు ఔదార్యం చూపించాయి. కష్టమర్లు, ఉద్యోగులకు వెన్నుదన్నుగా నిలిచాయి. ఈ ఈ సందర్భంగా శ్రేయ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్, శ్రేయ ఫౌండేషన్ ప్రెసిడెంట్ హేమంత్ కుమార్ రాయ్ మీడియాతో మాట్లాడుతూ కంపెనీ ప్రవేశపెట్టిన బిల్డింగ్ మెటీరియల్ ఇనిషియేటివ్ ప్రోగ్రాంలో ఆర్థికంగా వెనుకబడి సొంత ఇంటి కోసం కలలు కనే వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు.

చైల్డ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ కింద ఎల్కెజి నుంచి 12వ తరగతి వరకు నిరుపేదలైన పిల్లల విద్యా ఖర్చులను శ్రేయ ఫౌండేషన్ భరిస్తుందన్నారు. ఉన్నత విద్యా కార్యక్రమం కింద ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు ఉన్నత విద్యను అభ్యసించడంలో సహాయ పడుతున్నట్లు తెలిపారు. అలాగే గర్ల్స్ మ్యారేజ్ ఇనిషియేటివ్ ప్రోగ్రాం కింద వెనుకబడిన బాలికల వివాహానికి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సీనియర్ వీడియో జర్నలిస్ట్ శ్రీధర్కు మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ శనివారం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల న్యూస్ కవరేజ్ లో ప్రమాదవశాత్తు ఎడమ చేయి విరిగిపోవడంతో శ్రీధర్ కొద్దిరోజులుగా ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గణేష్ కుమార్ బాధితుడు శ్రీధర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. భరోసానిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షులు ముజీబ్ ఖాన్, గనగళ్ల రామరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలు ఏవీ ?

సర్దుబాటుతో భర్తీ
ఆందోళనలో నిరుద్యోగులు
డిఎస్సికి ప్రతిబంధకంగా మారిన జిఒ 117

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిఒ 117 ఆధారంగా తేల్చిన మిగులు ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం ఖాళీల్లో సర్దుబాటు చేయడంతో డిఎస్సి పోస్టులు భారీగా తగ్గనున్నాయి. విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి బదులు సెక్షన్ల ఆధారంగా ఉపాధ్యాయులను కేటాయించి గత ప్రభుత్వం భారీగా ఉపాధ్యాయ మిగులు చూపింది. ఈ జిఒను రద్దు చేసి, జిఒ 53 ప్రకారం విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి ఆధారంగా ఉపాధ్యాయులను కేటాయించాలని నిరుద్యోగులు, యుటిఎఫ్ డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం 117 జిఒను రద్దు చేయకుండా, ఆ జిఒ ద్వారా మిగిలిన ఉపాధ్యాయులను సర్దుబాటు చేసింది. దీంతో మెగా డిఎస్సిలో ఎస్జిటి, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల సంఖ్య తగ్గనుంది. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. విలీన తరగతులపై కూడా ఈ ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవడంలేదు. విలీనాన్ని రద్దు చేసి తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో ఆ తరగతులను కలిపే ప్రయత్నం చేయడంలేదు.

విలీన తరగతుల రద్దు, విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని అమలుచేయకపోతే ప్రభుత్వం విడుదల చేయబోయే డిఎస్సి నోటిఫికేషన్ నిరుద్యోగులకు నిరాశ మిగల్చనుంది. మెగా డిఎస్సిపై నోటిఫికేషన్కు పెద్ద అవరోధంగా మారిన జిఒ 117ను ప్రభుత్వం రద్దు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. గత ప్రభుత్వ విధానాలను తిరగదోడుతున్న కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల రేషనలైజేషన్కు సంబంధించిన జిఒ 117ను సజీవంగా వుంచడంతో పాటు దానికి మరింత శక్తిని ఇస్తోంది. గతంలో ఉన్నత పాఠశాలల్లో 1:40 ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి వుండేది. గత ప్రభుత్వం ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థుల సంఖ్యను 53కు పెంచింది. తొమ్మిది, పది తరగతుల విద్యార్థుల సంఖ్యను 60కి పెంచి ఉపాధ్యాయులను తగ్గించింది. జిఒ 53ను పక్కనబెట్టి సెక్షన్ల ప్రాతిపాదికన ఉపాధ్యాయులను కేటాయించి విద్యాబోధనను అస్తవ్యస్తం చేసింది. జిల్లాలో గత ప్రభుత్వం మిగులుగా చూపిన 765 ఉపాధ్యాయుల్లోని కొంతమందితో 238 మంది ఉపాధ్యాయుల కొరతను ఈ ప్రభుతం సర్దుబాటు ద్వారా భర్తీ చేసింది. విద్యాశాఖ సమాచారం ప్రకారం ప్రస్తుతానికి హిందీ పోస్టులు 43 మినహా మిగిలిన పోస్టులు నామమాత్రంగా వున్నాయి. డిఎస్సి నోటిఫికేషన్ జారీకి జిఒ 117 ప్రతిబంధకంగా మారినా, ప్రభుత్వం ఆ జిఒను కొనసాగించడం నిరుద్యోగులకు నష్టం కలిగించనుంది.

అన్న క్యాంటీన్కు విరాళం


ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అన్న క్యాంటీన్ పథకానికి 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ రూ.లక్షా 20 వేలు విరాళాన్ని అందించారు. ఆ మొత్తాన్ని రాష్ట్ర ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్కు చెక్కు రూపంలో అందజేశారు. తనకు కార్పొరేటర్గా వచ్చిన జీతాన్ని ఇలా విరాళంగా అందజేసినట్టు మూర్తియాదవ్ తెలిపారు. గతంలో తాను చేసిన సేవలను గుర్తుచేశారు

వీధి కుక్కల స్వైర విహారం

మనుషులు, జీవాలపైనా దాడులు
వాహనదారులను వెంబడిస్తున్న వైనం
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి జంక్షన్, విఆర్.పురం సంతపాకలతో పాటు పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్డుపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులను కరుస్తున్నాయి. సైకిల్, ద్విచక్ర వాహనదారుల వెనుక పరిగెత్తివెళ్లి దాడి చేస్తున్నాయి. రాత్రివేళల్లో దాడులు చేస్తుండడంతో కుక్కలు కనబడితే తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. విఆర్.పురం సంతపాకల వద్ద ఇద్దరిపై ఇటీవల కుక్కలు దాడులు చేశాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కోళ్లు, మేకలు, గొర్రెలు, ఆవు దూడలపై కూడా దాడులు చేస్తున్నాయి. కుక్కలు దాడి వల్ల మేక పిల్లలు, గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల రేఖపల్లి పంచాయతీ గొల్లగూడెంలో మేకలు, గొర్రెలు పాకలో ఉండగానే కుక్కల గుంపు వాటిపై దాడి చేసి చంపేశాయి. దీంతో వాటి యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతిరోజూ మండలంలో ఎక్కడో ఒక చోట ఎవరో ఒకరు వీధి కుక్కల బారిన పడి గాయపడిన సంఘటనలు జరుగుతున్నాయంటే వీధి కుక్కల బెడద ఎంత తీవ్రంగా అర్థం చేసుకోవచ్చు. చికెన్ సెంటర్లో వద్ద వ్యర్థాలను వ్యాపారులు వేస్తుండటంతో అక్కడ కుక్కలు ఎక్కువగా గుమిగూడుతున్నట్లు తెలుస్తోంది. వీధి కుక్కలు ఎగబడి కరుస్తున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్నోసార్లు ఎంపిడిఒ, తహశీల్దారులకు తెలియజేసినా పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కలను అరికట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


రోడ్లపై సంచరిస్తున్న కుక్కలు

తునికాకు సేకరణ డబ్బులు చెల్లించాలి

ప్రజాశక్తి- చింతూరు

తునికాకు సేకరించిన గిరిజన కార్మికులకు తక్షణమే డబ్బులు చెల్లించాలని గిరిజన సంఘం మండల నాయకులు ఓగ్గల సీతారామయ్య డిమాండ్ చేశారు. మండలంలోని మధుగురు గ్రామస్తులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు రెండో పంటగా భావించే తునికాకు సేకరణ చేసి దాదాపు 6 నెలలు గడుస్తున్నా ఇంతవరకు పూర్తిస్థాయిలో డబ్బులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. తునికాకు సేకరించిన డబ్బులు వస్తే వ్యవసాయానికి పనికొస్తాయని గిరిజన రైతులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేయలేదా? ఫారెస్ట్ అధికారులు ఇవ్వడం లేదా? అనేది అర్థం కాక అయోమయంలో గిరిజనులు ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా టిడిపి కూటమి ప్రభుత్వం తునికాకు సేకరణ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పండా నారాయణ, కారం రాములమ్మ, సోయం భారతి, సుబ్బారావు, జోడే వెంకమ్మ. తదితరులు పాల్గొన్నారు.

2న ప్రత్యేక పోషణ మేళా

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఐసీడీఎస్ మారేడుమిల్లి ప్రాజెక్ట్ ఆధ్వర్యాన సెప్టెంబర్ 2న సోమవారం మరేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఒక ప్రత్యేక పోషణ మేళాను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎ.వీర కిషోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత గర్భిణుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, పోషణ విలువలపై అవగాహన కల్పించడం, సమర్థవంతమైన ఆహార అలవాట్లను అలవాటు చేయడంపై ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలు ఆరోగ్యకరమైన పోషణను పొందడంలో వారికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తారని తెలిపారు. గర్భిణీ స్త్రీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనలు, ఆహార తయారీ పద్ధతులు, పోషకాహార పరంగా సరైన విధానాలపై శిక్షణలతో పాటు, పోషకాహార కిట్లు పంపిణీ చేయడం వంటి కార్యకలాపాలు జరగనున్నాయని వెల్లడించారు.

ఐటిడిఎ పిఒను కలిసిన జమాల్ ఖాన్

ప్రజాశక్తి- చింతూరు : చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అపూర్వ భారత్ను ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధికి బాటలు వేయాలని, విద్య వైద్యంతో పాటుగా అన్ని రకాల రంగాల్లో ఏజెన్సీ వాసులు ముందుండేలా చూడాలని కోరారు. ఆయుర్వేదం పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ సహకారం కావాలన్నారు. ఆదివాసీల అభివృద్ధి ఐటిడిఎ ధ్యేయమని, అందుకు తన వంతు సహకారం ఉంటుందని జమాల్ ఖాన్ ఈ సందర్భంగా తెలిపారు.

ధరా భారంపై పోరు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో అన్ని తరగతుల ప్రజలపై ధరల భారం పెరుగుతోందని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1 నుంచి వారం రోజుల పాటు దేశవ్యాప్తంగా ఆందోళనలకు తమ పార్టీ పిలుపునిచ్చిందన్నారు. అందుకు సంబంధించిన పోస్టర్ను ఆయన పార్టీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, సిఎన్.క్షేత్రపాల్, నాయకులు జెడి.నాయుడు, ఎ.దేముడమ్మ, బి.పుష్పలత పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజవర్గం 34వ వార్డులో చిరు వ్యాపారులకు రూ.లక్ష విలువైన సామగ్రిని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం పంపిణీ చేశారు. 34వ వార్డు జనసేన సీనియర్ నాయకులు నీలం రాజు సొంత నిధులతో మూడు తోపుడు బండ్లు, రెండు బడ్డీలు, రెండు బిగ్ సైజ్ గొడుగులను సమకూర్చగా వంశీకృష్ణ వాటిని చిరు వ్యాపారులకు అందజేశారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బ్యాంక్ ఆఫ్ బరోడా విశాఖపట్నం రీజియన్ పరిధిలో పార్వతీపురం మన్యంలోని పాచిపెంటలో 43వ నూతన శాఖను శనివారం ఉదయం ప్రారంభించారు. బ్యాంకు విశాఖపట్నం రీజనల్ హెడ్ పిఎం.పధాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశాఖపట్నం రీజియన్ పరిధిలో ఖాతాదారులకు నమ్మకమైన సేవలను అందిస్తూ బ్యాంక్ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ సతీషా సాలుంకే, బ్రాంచ్ మేనేజర్ కె.భాను ప్రతాప్ పాల్గొన్నారు.